# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 44 | విశాఖపట్నం | 14-11-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 44 | VISAKHAPATNAM | 14-11-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


### పెట్టుబడులకు ప్రోత్సాహకాలు, వేగంగా అనుమతులు ఇవ్వటంలో

# ఏపీకి పోటీ లేదు: చంద్రబాబు





**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖలో గూగుల్ భారీ పెట్టుబడులతో అడుగు పెట్టనుందని రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖలోని నోవాటెల్‌లో నిర్వహించిన ఇండియా - యూరప్ బిజినెస్ సమావేశంలో పాల్గొన్న సీఎం సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఐటీలో భారతీయులదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. ఇండియా-యూరప్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సీఎం చెప్పారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ అందుబాటులోకి రానుందని ఇంక పెట్టుబడులకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ఏపీ ముందుందని అలానే గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా పెట్టుబడులు రానున్నాయని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ముందుకెళ్తున్నామని అన్నారు. రాష్ట్రంలో పోర్టులతో పాటు రైల్వే అనుసంధానానికి ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీలో నైపుణ్యం ఉన్న యువత అందుబాటులో ఉన్నారని కొత్త ఆలోచనలతో వినూత్న ఆవిష్కరణలు చేయడంతో వారు ముందున్నారని అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టండి అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండదని 45 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన ఉత్పత్తికి ప్రోత్సాహం అందిస్తున్నాని సీఎం చంద్రబాబు తెలిపారు. "గతంలో మీరు సులభతర వాణిజ్యం గురించి విని ఉంటారు. మేము ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకెళ్తున్నాం. మీరు భారత్, ఆంధ్రప్రదేశ్‌లో ఏదైనా పెట్టుబడి పెట్టాలని నిర్ణయం తీసుకున్నాక ఆ ప్రాజెక్టు మాదిగా భావిస్తాం. అన్ని అనుమతులు వెంటనే యుద్ధప్రాతిపదికన ఇస్తాం. అందరికన్నా మెరుగ్గా మేము రాయితీలు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మాకు ఎవరూ సరిరారు. మీరు అప్లికేషన్ పెట్టిన వెంటనే అనుమతులు ఇవ్వడంతోపాటు తర్వాత ఎస్కార్ట్ ఆఫీసర్‌ను పెట్టి ఫాలోఅప్ చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసే వరకు సహకరిస్తాం. భారతదేశంలో అవకాశాలకు కొదవలేదు. ఆ అవకాశాల్ని ఆంధ్రప్రదేశ్‌తోనే ప్రారంభించండి. పెట్టుబడులతో భారతదేశంలోకి ప్రవేశించడానికి ఆంధ్రప్రదేశ్ గేట్ వేలా పనిచేస్తుంది."- ముఖ్యమంత్రి చంద్రబాబు

160 గిగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రయత్నం: గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్ 500 గిగావాట్ల విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా 160 గిగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రయత్నిస్తున్నామని ఇంక సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో బలంగా ఉన్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని అలానే డ్రోన్లను పెద్దఎత్తున వినియోగంలోకి తెస్తున్నామని వెల్లడించారు. డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని నిర్ణయించామని ఇంక స్పేస్ సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

### విశాఖ ఐటీ సహా పలు కంపెనీలకు

# లోకేశ్ భూమి పూజ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్వేర్, ఐస్పేస్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్స్ లెన్స్ సెంటర్ ద్వారా 430 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్పై రెండుదశల్లో రూ. 207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైర్రెడ్డి వెల్లడించారు. అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్మె, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్స్ లెన్స్ పై ఫినోమ్ దృష్టి సారించనుంది. 3 దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టి, 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఓ సేవల డెలివరీ కార్యకలాపాలను ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టనుంది.



### తెలుగు తమ్ముళ్లకు భారీ హెచ్చరిక..

### పార్టీ నుంచి వెళ్లిపోండి

# బండారు హెచ్చరిక

- ఎమ్మెల్యే బండారు స్వతహాగా చాలా మంచి వ్యక్తి
- వలస నాయకుల వల్ల తలనొప్పులు తెచ్చుకున్నారు అంటున్న పార్టీ కార్యకర్తలు, టిడిపి తమ్ముళ్లు
- వైసిపి వలస నాయకుడు వల్ల గొడవలు
- టిడిపి పార్టీకి నష్టం జరుగుతుంది పట్టించుకోవాల్సిందే!
- పార్టీకి నష్టం చేస్తే సస్పెండ్ చేస్తా ఎమ్మెల్యే బండారు
- పార్టీ కార్యకర్తలపై ఆగ్రహించిన ఎమ్మెల్యే!

(దేవరాపల్లి, పతాకం న్యూస్)

అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం..చినుకి చినుకి వాన గుట్టు చొప్పుడు కాకుండా ఉండు వాన, అంటే నేను ఉండనంటుంది టీడీపీ తమ్ముళ్లు వాన.... గ్రామ మండలస్థాయి పార్టీ ప్రమాణస్వీకారం ఉత్సవాలు ఎమ్మెల్యే సాక్షిగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవలు ఇస్తున్నారని టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కోసం కష్టపడి నాయకులు కాదు అని, వైసీపీ నుంచి వలస పక్షులకి పార్టీ పదవులు ఇస్తే ఊరుకోమని హెచ్చరిక జారీ చేశారు కార్యకర్తలు ఎమ్మెల్యేకు,వెంటనే ఎమ్మెల్యే ఉంటే ఉండండి పోతే పోండి పార్టీనుండి సస్పెండ్ చేస్తానని ఒక్కసారిగా కోపం తెచ్చేకున్నారు ఎమ్మెల్యే గారు, కార్యకర్తలు కూడా అదే స్థాయిలో రెచ్చిపోయారు, మీరే పోండి, 21 రోజుల్లో ఎమ్మెల్యే అయిపోయారు అంటే మేము పెట్టిన బిక్ష మీకు,అని కార్యకర్తలు అంటున్నారు అంట,అసలు చంద్రబాబు నాయుడు గారు మీకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనంటే మేము కోరుండి తెచ్చుకున్నాం పార్టీ సీనియర్ నాయకులు కదా అని మీకు తెలుసా ఓ కార్యకర్తమాట,మా నియోజకవర్గానికే తెచ్చుకుంటే మీరే మమ్మల్ని పొమ్మండడానికి మీరెవరు,మీరే వెళ్లిపొండి... పార్టీ కోసం పుట్టాం, పార్టీ కోసం ఏమి ఆయినచేస్తాం పార్టీకోసం, వైసీపీ నాయకులు మా మీద అక్రమ కేసులు పెట్టినప్పుడే మేము ఎదిరించి పార్టీ భవిష్యత్తు కోసం పనిచేసాం పార్టీ నియమాలుకు కట్టుబడి ఉన్నాం, వాళ్లలాగా అడ్డదారులో వైసిపి పార్టీ నుంచి వచ్చిన వాళ్లము కాదు, వైసీపీ పక్షుల వాళ్లకు అందలం ఎక్కించడం ఏంటి,పార్టీ కోసం ఏదైనా చేస్తాం మీరే ఇక్కడ నుంచి వెళ్లిపొండి గట్టిగా సమాధానం ఇచ్చారు పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే గారికి....వలస పక్షిగా పార్టీలోకి వచ్చిన వాళ్ల మనుషులుకు పదవులు ఇస్తామంటే చూస్తూ ఊరుకోలేం అని పార్టీ కార్యకర్తలు గట్టి హెచ్చరిక జారీ చేశారు.. ఎమ్మెల్యేకి ఏమీ చేయ్యాలో తెలియని పరిస్థితి, దీనస్థితిలోకి వెళ్లిపోయారు బండారు...ఒకపక్క సీఎం చంద్రబాబు సిఏ సమ్మెట విశాఖలో బిజీగా గడుపుతూ భవిష్యత్తు తరాల కోసము పార్టీ కోసం, జనం కోసం,ప్రజల కోసం 40 దేశాల ప్రతినిధులతో విశాఖ జిల్లాలోని బిజీగా ఉండి సమ్మిట్ లో ముందుకు తీసుకెళ్తూ తొమ్మిది లక్షల కోట్లు పెట్టుబడులు ఒప్పందాలు చేసుకుంటుంటే మాడుగుల టిడిపిలో కుమ్ములాటలు ఏంటి అని టిడిపి కార్యకర్తలుకు నాయకులుకు పార్టీ పరిశీలకడు యేసుదాస్ సీరియస్ అయ్యారు అంట,కొత్త కమిటీల్లో అన్యాయం జరిగిందంటూ సీనియర్ కార్యకర్తలు ఎమ్మెల్యే ఎదుటే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పార్టీలో చేరిన నేతలకు పదవులు ఇవ్వడంపై వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు యేసు దాసు పరిస్థితిని చక్కదిద్దారు. పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఉదారంగా స్పందించాలి

భౌగోళిక పరిస్థితుల కారణంగా రాష్ట్రం సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఫలితంగా సూళ్లూరుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు విస్తరించిన తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి ఆయన చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశుసంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది.

గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద పర్యటన ఈ సారి త్వరగా జరిగినట్లే! ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. ఇల్లలకగానే పండగ కాదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి నిజంగా ఉంటే అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు ఇప్పటికే ఇచ్చి ఉండాలి. అలా జరగలేదు! ఈ నేపథ్యంలో బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి.

## కేబినేట్ నిర్ణయాలపై మోడీ కామెంట్స్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎగుమతులకు సంబంధించి కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరుస్తాయని, స్వావలంబన కలను సాకారం చేసుకోవడానికి సహాయపడతాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. బుధవారం మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఎగుమతి ప్రోత్సాహక మిషన్, ఎగుమతిదారులకు క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ఆమోదించింది. "మేడ్ ఇన్ ఇండియా"ను నిర్ధారించడం ప్రపంచ మార్కెట్‌లో మరింత బలంగా ప్రతిధ్వనిస్తుంది! ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరిచే, సహకరించే ఎంఎస్‌ఎంఈలు, మొదటిసారి ఎగుమతి చేసేవారికి సహాయపడే ఎగుమతి ప్రమోషన్ మిషన్ (ఈపిఎం)ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని మోదీ ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపారు. గ్రాఫైట్, సీసియం, రుబిడియం మరియు జిర్కోనియం యొక్క రాయల్టీ రేట్లను హేతుబద్ధీకరించే నిర్ణయం సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని మోదీ అన్నారు. గ్రీన్ ఎనర్జీకి కీలకమైన గ్రాఫైట్, సీసియం, రుబిడియం మరియు జిర్కోనియం ఖనిజాల రాయల్టీ రేట్లను హేతుబద్ధీకరించడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## "క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుంది

### సీఎం చంద్రబాబుపై జగన్ కామెంట్స్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** ఏపీ సిఎం చంద్రబాబు కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న "క్రెడిట్ చోరీ స్కీం" చాలా బాగుందని వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్క సెంటు స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇళ్ళ కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని, ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ "ఇళ్లన్నీ మేమే కట్టేశాం" అంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' హేయంగా ఉందని పేర్కొన్నారు. తాము ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదని తెలిపారు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు తమ హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవేనని జగన్ పేర్కొన్నారు. మరో 87,380 ఇళ్లు శ్లాబ్ లెవల్ వరకూ గత ప్రభుత్వ హాయాంలోనే కట్టించినవేనని తెలిపారు. ఇవికాక అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లలో ఒకేరోజు గృహప్రవేశాలతో గత ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, ఇన్ని వాస్తవాలు కళ్ళముందే ఉన్నాఅసలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, అన్నీ ఈ ప్రభుత్వమే చేసినట్టుగా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్న చంద్రబాబు క్రెడిట్ చోరీ స్కీం చాలా హేయమని జగన్ ఆగ్రహించారు.

### అది మా చట్టబద్ధమైన భూమి

## పవన్‌పై మిథున్ రెడ్డి ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములు ఆక్రమించారంటూ పవన్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి తూర్పు కనుమల పరిధిలోని మంగళం పేటలో అటవీ భూములను ఆక్రమించారని ఆరోపిస్తూ డిప్యూటీ సీఎం పవన్ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ భూ కబ్జాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమగ్ర విచారణ జరిపించాలని కూడా ఆయన కోరారు. పవన్ కల్యాణ్ ఆరోపణలపై పెద్దిరెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "పవన్ కల్యాణ్ గారూ, గతంలో ఎర్రచందనం విషయంలో మీరు చేసిన వ్యాఖ్యలు గుర్తున్నాయా? ఇప్పుడు హెలికాప్టర్‌లో నుంచి మీరు చూపించిన భూమి మా చట్టబద్ధమైన సొత్తు. ఆ భూమిని మేము 2000 సంవత్సరంలోనే కొనుగోలు చేశాం" అని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తమపై చేసిన ఆరోపణలు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## విశాఖ సదస్సుకు 3,500 మందితో భారీ భద్రత: మంత్రి అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. దాదాపు 3,500 మంది పోలీసులతో పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రత విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని తేల్చిచెప్పారు. సదస్సుకు హాజరయ్యే ప్రతి వీఐపీ విమానాశ్రయంలో అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వారి గమ్యస్థానాలకు చేరేంత వరకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే బాధ్యతను పోలీసు శాఖ తీసుకుందని అనిత వివరించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తి అప్రమత్తత ప్రకటించామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తీవ్రవాదంతో పాటు "రాజకీయ ఉగ్రవాదం" పైనా తమ ప్రభుత్వం సీరియస్‌గా ఉందని మంత్రి అనిత వ్యాఖ్యానించారు. విశాఖ సదస్సుపై జగన్ బ్యాచ్ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని ఉపేక్షించేది లేదని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే ఇలాంటి చర్యలను కఠినంగా అణచివేస్తామన్నారు.

గతంలో వలసలకు కేంద్రంగా ఉన్న ఉత్తరాంధ్ర, ఇప్పుడు పెట్టుబడులతో వలస వచ్చేవారికి గమ్యస్థానంగా మారుతోందని మంత్రి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన కంపెనీలు ఇప్పుడు తిరిగి వస్తున్నాయంటే దానికి "బ్రాండ్ సీబీఎన్", మంత్రి నారా లోకేశ్ కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టుదలే కారణమని ఆమె కొనియాడారు. వారి సమష్టి కృషితోనే రాష్ట్రానికి మళ్లీ మంచిరోజులు వచ్చాయని తెలిపారు.

## భాగస్వామ్య సదస్సుకంటే ముందుగానే భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత చూపుతున్నాయి. మంత్రి లోకేష్ ప్రకటించినట్లు ఇంధన రంగంలో రెన్యూ పవర్ సంస్థ భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెన్యూ పవర్ సంస్థ ఎంఓయూలు కుదుర్చుకున్నది. రెన్యూ పవర్‌ఈ సంస్థ ఈడీబీతో రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలతోపాటు గతంలోనే రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు కొనసాగించేందుకు సిఎం, లోకేషతో చర్చించింది. ఈ సంస్థ పునరుత్పాదక శక్తి, సోలార్ తయారీ, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ హైడ్రో, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్స్ వేఫర్ ప్లాంట్, ఇంగోట్-వేఫర్ ప్లాంట్, 2 గిగా వాట్ల పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కెటిపిఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ వంటి వాటిల్లో 5 గిగావాట్ల హైబ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి దొరికే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టును అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు రెన్యూ పవర్ అంగీకారం తెలిపింది. గత ప్రభుత్వంలో రాష్ట్రం వీడి వెళ్లిన కంపెనీలు తిరిగి భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి సిద్దంగా ఉన్నాయని నిన్ననే మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

## మాస్కులు కూడా సరిపోవు : ఢిల్లీ వాయుకాలుష్యంపై సుప్రీం ఆందోళన



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా 400కిపైనే నమోదవుతోంది. దీంతో రాజధాని వాసులు శ్వాసకోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్య తీవ్రతను తట్టుకోవడానికి మాస్కులు కూడా సరిపోవని వ్యాఖ్యానించింది. సీనియర్ న్యాయవాదులను వర్చువల్‌గా విచారణకు హాజరుకావాలని సూచించింది. వర్చువల్‌గా హాజరయ్యే వెసులుబాటు ఉన్నప్పటికీ మీరు ఎందుకు భౌతికంగా కోర్టు కార్యకలాపాలకు హాజరువుతున్నారని సీనియర్ న్యాయవాదులను జస్టిస్ పీఎస్ నరసింహ ప్రశ్నించారు. 'మీకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యే సౌకర్యం ఉంది. అయినా ఎందుకు వస్తున్నారు..? దాన్ని సద్వినియోగం చేసుకోండి. కాలుష్యం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది' అని అన్నారు. ఈ విషయంపై ప్రధాన న్యాయమూర్తితో చర్చిస్తామని జస్టిస్ పిఎస్ నరసింహ తెలిపారు.

# జెర్రెల ప్రభుత్వ బాలుర పాఠశాలల్లో 57 మంది విద్యార్థులకు అస్వస్థత



**జీకే వీధి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా జీకేవీధి మండలం జెర్రెల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలల్లో వికటించిన పెరుగుతిని 57 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. 57 మంది గురికావడానికి గల కారణం వికటించిన పెరుగు పెట్టడంతోనే విద్యార్థులకు వాంతులు, విరోచనాలు, తలనొప్పి, జ్వరం, గుండె దడ లక్షణాలతో బాధపడుతూ ఉదయం 7 గంటలకు హాస్పిటల్ కి చేరారు. విషయం తెలుసుకున్న పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు సిహెచ్ అశోక్ మరియు జీకే విధి మండల పిసా కార్యవర్గ సభ్యులు జెర్రిల పి హె సి లో వైద్యం అందిస్తున్న పిల్లలను పరామర్శించారు. ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడ జరిగిన విషయాలన్నీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్కూల్ యాజమాన్యం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజువారి మెనూ పద్ధతిలోనే పాలను వడబోసి పెరుగు చేసి పెట్టె క్రమంలోనే వికటించిందని అన్నారు. రోజువారి పద్ధతిలో పాలను పెరుగు తోడి పెట్టినప్పటికీ ఎలా వికటించిందో తమకు అర్థం కావటం లేదని స్కూల్ వార్డెన్ తెలియజేశారు. ఇదిలా ఉండగా ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతూ ఉన్నాయి అందుకనే ప్రతి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో రాత్రిపూట పిల్లలకు అవస్థత వచ్చినప్పుడు హెల్త్ అసిస్టెంట్ మరియు ఏ ఎన్ఎం లను ప్రభుత్వం నియమించాలని కోరారు. కారణం ఏదేమైనా జరిగిన చిన్నపాటి తప్పి దానికి 57 మంది విద్యార్థుల ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడినందుకు సంతోషం అన్నారు. ఇంకా అవస్థతకు గురవుతున్న విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం తక్షణమే ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# విశాఖ అభివృద్ధికి నేవీ సహకరించాలి: చంద్రబాబు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సీఎం చంద్రబాబుతో తూర్పు నౌకాదళ కమాండింగ్-ఇన్-చీఫ్, వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా భేటీ అయ్యారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా విశాఖ భవిష్యత్ ప్రణాళికల్లో నేవీ భాగస్వామ్యంపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సమావేశంలో వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా తూర్పు నౌకాదళ కార్యకలాపాలను ముఖ్యమంత్రికి వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా రక్షణ రంగంలో సేవలు అందించే కంపెనీలు, స్టార్టప్‌లను రాష్ట్రానికి ఆహ్వానించే అంశంపై ఇద్దరూ చర్చించారు. స్వదేశీ నౌకా నిర్మాణం, సాంకేతిక అభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నేవీ నిర్వహించే ఫ్లీట్ రివ్యూలకు ప్రజల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన గురించి కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "విశాఖ నగరం భవిష్యత్తులో అనేక అవకాశాలకు, ప్రతిష్ఠాత్మక సంస్థలకు కేంద్రంగా మారబోతోంది. ఇది ఫ్యూచర్ సిటీగా రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రయాణంలో రాష్ట్ర ప్రభుత్వం, నౌకాదళం కలిసి పనిచేయాలి" అని అన్నారు. విశాఖను కేవలం నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగానే కాకుండా, అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూడా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, దీనికి తూర్పు నౌకాదళం సహకారం అందించాలని కోరారు. "నేవీ అంటే కేవలం యుద్ధ శక్తి మాత్రమే కాదు. వారి విజ్ఞానాన్ని, నైపుణ్యాలను ప్రజలకు, ముఖ్యంగా యువతకు చేరువ చేయాలి. నేవీ మ్యూజియం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా యువతకు రక్షణ రంగంపై అవగాహన పెరిగి, స్ఫూర్తి పొందుతారు" అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏపీ యువత రక్షణ రంగంలో చేరేందుకు చూపిస్తున్న ఆసక్తి సంతోషాన్ని కలిగిస్తోందని ఆయన అన్నారు. నౌకాదళం చేపట్టే వివిధ ప్రాజెక్టులు, ఇతర కార్యకలాపాలకు అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాకు సీఎం హామీ ఇచ్చారు.

# ఏపీలో 4 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి హీరో గ్రూప్ ఎంఓయూ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏపీలో 4 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రూ.15 వేల కోట్ల వ్యయంతో అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఈ పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలపై హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ-ఈడీబీ పరస్పరం సంతకాలు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సీఎండీకి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీ, హైబ్రీడ్ సొల్యూషన్స్ రంగాల్లోనూ పెట్టుబడులతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. డెడికేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ పార్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మరోవైపు రామాయపట్నం వద్ద అత్యాధునిక ఫర్నిచర్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు స్వీడన్ కు చెందిన జూల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఆ సంస్థ ఫౌండర్ సీఈఓ టామ్ ఓలాండర్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రూ.300 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనున్నామని జూల్ సంస్థ తెలిపింది. నార్వే, స్వీడన్ల నుంచి భారీ దుంగలను దిగుమతి చేసుకుని డోర్లు, విండోలు లాంటి ఉత్పత్తులతో పాటు ప్రీ ఫాబ్రికేషన్ విధానంలో ఇళ్లను కూడా రూపొందిస్తామని జూల్ సీఈఓ టామ్ ఓలాండర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రామాయపట్నం పోర్టు సమీపంలో 500 ఎకరాల్లో ఫర్నిచర్ క్లస్టర్ సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అమరావతి నగరంతో పాటు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని సీఎం వెల్లడించారు. అనంతరం ప్రముఖ ఆటబొమ్మల తయారీ సంస్థ పాల్స్ ప్లష్ టాయ్స్ సంస్థ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రిని కలిసి అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద టాయ్ పార్క్ ఏర్పాటుపై చర్చించారు. చైనా తరహాలో ఆట బొమ్మల తయారీకి సంబంధించిన ఎకోసిస్టమ్‌ను తయారు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం బొమ్మల తయారీలో స్థానికంగా ఉన్న మహిళలకు ఉపాధి కల్పించాలని ఆ సంస్థ ప్రతినిధుల్ని కోరారు.




# కామ్రేడ్ రామునాయుడుకు సీపీఎం జిల్లా నేతలు ఘన నివాళులు



**గొలుగొండ, డెక్కన్ న్యూస్:** సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మాకిరెడ్డి రామునాయుడు అంతిమ యాత్రలో సీపీఎం జిల్లా కమిటీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రామునాయుడు పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ రామునాయుడు మరణం కుటుంబానికి, సీపీఐకి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. రైతులు,కార్మికులు, పేదల పక్షాన అనేక ఉద్యమాలు నడిపిన ఆయన వామపక్ష ఐక్య ఉద్యమాలకు ఎంతో కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరి,ఈరెల్లి చిరంజీవి,వి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


# ముఖ్యమంత్రి చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని తైవాన్ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృతంలోని తైవాన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి తైవాన్ బృందానికి వివరించారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో - తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ముఖ్యమంత్రికి తెలిపింది. పాద రక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూప్ ఫుట్ వేర్ యూనిట్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సార్లను ఉత్పత్తి చేసేందుకు తైవాన్‌కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని కోరింది. ఓర్వకల్లు సమీపంలోనే ఇ-జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్డ్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటిరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ప్రతిపాదించింది. వీటికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తైవాన్ కంపెనీల ప్రతినిధులు- ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నారు. తైవాన్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కుకు భూములు కేటాయిస్తామని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులకు వివిధ రహదారులను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. కర్ణాటక, ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ ఈ రహదారి మార్గాలు ఉన్నాయని తైవాన్ ప్రతినిధులకు వివరించారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పాలసీలో భాగంగా ప్రోత్సాహకాలకు సంబంధించిన నిర్ణయాలు త్వరలోనే కేంద్రం విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధమని సీఎం వెల్లడించారు. తైవాన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ సహకారం బాగుందని తైవాన్ బృందం కొనియాడింది.ఆంధ్రప్రదేశ్?లో ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ భేటీల్లో భాగంగా గురువారం భారతదేశంలోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని ముఖ్యమంత్రి బార్టోలీకి వివరించారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి-ఇటలీ రాయబారి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకానిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

# రెజ్లింగ్‌లో జాతీయ జట్టుకు ఎంపికైన గుండుపాల విద్యార్థిని దీక్ష

**గొలుగొండ, పతాకం న్యూస్:** విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి, జాతీయస్థాయికి ఎంపికైన గొలుగొండ మండలం గుండుపాల ఉన్నత పాఠశాల విద్యార్థిని కుండల దీక్ష క్రీడాభిమానులను ఆకట్టుకుంది. జనవరి 10 నుంచి ఢిల్లీలో ప్రారంభమయ్యే జాతీయ రెజ్లింగ్ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఏ రంగాన్ని ఎంచుకున్నా నిజాయితీతో కృషి చేస్తే గుర్తింపు,గౌరవం, ఉన్నత భవిష్యత్తు సొంతమవుతాయని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు దీక్షను అభినందిస్తూ,జాతీయస్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం అన్నదాన కార్యక్రమంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



**మల్కాపురం, పతాకం న్యూస్:** పారిశ్రామిక ప్రాంతం అచ్చినాయుడుతోట జనతా కాలనీ మల్కాపురం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శ్రీ గణబాబు పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో సంఘం సభ్యులు,అధికసంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# 63వ వార్డులో అభివృద్ధి పనులను రూ.12 లక్షలతో శంకుస్థాపన



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాల మేరకు గురువారం 63వ వార్డ్ జయేంద్ర కలనీ, ఒడియా వీధి వద్ద రిపైర్స్ డ్రీమ్స్ సిసి రోడ్స్ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ మరియు స్టాండింగ్ కమిటీ మెంబర్ గల్లా చిన్నా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జేరిపోతుల నర్సింగ్ రావు, వార్డు సెక్రటరీ గూడెల కృష్ణ, యూనిట్ ఇంచార్జ్ పోలై రాజు , టిడిపి యూత్ ప్రెసిడెంట్ గౌస్ బాబు,టిడిపి సీనియర్ నాయకులు,కనక, సందాని, మరియు మహిళ ప్రెసిడెంట్ కురుమంగ, అంబిక, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# గోడ పత్రిక షిప్‌యార్డ్ కాలనీలో జీవీ నిలయం పాఠశాలలో ఉపాధ్యాయలతో ఆవిష్కరణ



**గాజువాక, పతాకం న్యూస్:** ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు.. 40వ వార్డు పరిధి లో ఉన్న షిప్ యార్డ్ కాలనీ గాంధీగ్రామ్ శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి, బి కనకరాజు ఆధ్వర్యంలో.. 58వ జాతీయ గ్రంధాలయం వారోత్సవములో భాగంగా పలుపాఠశాల ఉపాధ్యాయులను కలిసి వారోత్సవాలకు, విద్యార్థులను పంపించాలని కోరుతూ. ఆహ్వాన పత్రాలను ఇచ్చారు .

# తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎం& హెచ్‌వో డాక్టర్ కృష్ణమూర్తి నాయక్

**చింతపల్లి, పతాకం న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణీలను వారం రోజులు ముందుగా గర్భిణీల వసతి గృహానికి తరలించి సుఖ ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ అన్నారు. మండలంలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ముందుగా అటెండెన్స్ ను, మూమెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న అన్ని వార్డులతో పాటు ప్రసూతి గదిని క్షుణ్ణంగా పరిశీలించి పరిశుభ్రంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.

## ధాన్యం కొనుగోళ్లలో వ్యాపారులదే హవా



**కాకినాడ, పతాకం న్యూస్:** ఎంత ధాన్యమైనా కొంటాం. లక్ష్యానికి మించి కొనుగోలు చేస్తామంటూ ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటి క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ నిబంధనల వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.45 లక్షల మంది రైతులు 1.58 లక్షల ఎకరాలలో వరి సాగు చేశారు. ఏటా ఈ సీజన్‌లో 5.70 లక్షల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గండేపల్లిలో 70 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. పెదపూడి, సామర్లకోట, యు.కొత్తపల్లి, కరప, ఏలేశ్వరం తదితర మండలాల్లో ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఎకరాకు సరాసరి 34 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. జిల్లాలో 269 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నెల 22 నుంచి గండేపల్లిలో అధికారికంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయితే ఇప్పటి వరకు కేవలం 17 కేంద్రాలలో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించారు. వీటి ద్వారా కేవలం సుమారు 1,100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఉదాహరణకు గండేపల్లి మండలంలో సుమారు 7,300 ఎకరాలలో ఈ ఏడాది రైతులు వరిని పండించగా ఇప్పటివరకు 70 శాతం కోతలు పూర్తయ్యాయి. ఈ మండలంలో ఇప్పటి వరకు పది వేల మెట్రిక్ టన్నుల దాన్యం ఉత్పత్తి కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కేవలం 70 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు.

## సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో మొగల్తూరు సబ్ రిజిస్టర్




**నరసాపురం, పతాకం న్యూస్:** మొగల్తూరు సబ్ రిజిస్టర్ సబ్బిత శ్రీనివాసులు సైబర్ నేరగాళ్లు ఏసీబీ పేరుతో బెదిరించి రెండు లక్షల కొట్టేశారు. మరో లక్ష రూపాయలు కోసం డిమాండ్ చేయటంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్టర్ మొగల్తూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో బెదిరించింది సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారని నిర్ధారించుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం సబ్ రిజిస్టర్ శ్రీనివాస్ కు ఏసీబీ పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. 'నీ మీద అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, మేము రాకుండా ఉండాలంటే మూడు లక్షలు మా అకౌంట్లో వేయాలని' కాల్ చేశారు. దీంతో శ్రీనివాస్ భయపడి ముందుగా రెండు లక్షలు ఫోన్ పే చేశాడు. అయినప్పటికీ కేటుగాళ్ళు విడిచి పెట్టలేదు. మిగిలిన లక్ష రూపాయలు అకౌంట్లో వెయ్యాలని పట్టుపట్టడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్టర్ మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మొగల్తూరు ఎస్సై వై.నాగలక్ష్మి కేసు నమోదు చేసారు. కేసు నమోదు చేసిన పోలీసులు బ్యాంక్ అకౌంట్, సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

## కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు



**కర్నూలు, పతాకం న్యూస్:** ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాలతో కర్నూలు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కర్నూలు ఆర్ టి సి బస్టాండ్ ఆవరణంలో, నెలల తరబడి బైక్ లు, కార్లు పార్కింగ్ చేసిన ప్రదేశాలలో, పార్సిల్ రవాణా కార్యాలయంలో తనిఖీలు చేపట్టామని కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కర్నూలు డిఎస్పీ కర్నూలు పట్టణ సిఐలు నాగరాజారావు, మన్సురుద్దీన్, కర్నూలు నాల్గవ పట్టణ ఎస్సై శ్రీనివాసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు, పోలీసు జాగిలాల తో కలిసి కర్నూలు ఆర్ టిసి బస్టాండ్ లోని అనుమానితుల ప్రయాణికుల బ్యాగులు, బస్టాండ్ పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానితుల కదలికలు, పార్సిల్ కార్యాలయంలో లగేజీలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 112 కు గాని , డయల్ 100 కు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని ప్రజలకు కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ సూచించారు.

## దేశ సమగ్రతను కాపాడదాం

**ఆదోని, పతాకం న్యూస్:** దేశ ఐక్యతను చాటి సమగ్రతను కాపాడే దిశగా ప్రతి ఒక్కరు వ్యవహరించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు నిర్వహించిన సమైక్యత ర్యాలీని ఆయన జెండా ఊపి కళాశాల నుండి మున్సిపల్ మైదానం వరకు ప్రదర్శనలో నడిచారు. వారితోపాటు ప్రదర్శనలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల రామకృష్ణ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు హాజరయ్యారు.

## చింతాలమ్మ ఘాట్ లో కొండచరియలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం



(కొయ్యూరు, పతాకం న్యూస్)

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని చింతాలమ్మ ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం భారీగా కొండచరియలు విరిగిపడి రోడ్డుమీదకు వచ్చి పడటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దాదాపు నాలుగు గంటల పాటు ప్రయాణికులు ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని యంత్రాలతో కొండచరియలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. 516-ఈ హైవే విస్తరణ పనులు ప్రారంభమైన తర్వాత ఈ రహదారిపై తరచుగా కొండచరియలు విరిగిపడుతున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు పక్కన ఎత్తయిన రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు అధికారులను కోరారు.

## సచివాలయ సిబ్బంది
## ఆడిందే ఆట.. పాడిందే పాట




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సచివాలయాల్లో కొందరు ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తోంది. సమయపాలన పాటించడం లేదు. ఏ రోజు కూడా పూర్తిస్థాయిలో సిబ్బంది హాజరైన దాఖలాలు లేవు. వారి కోసం ఎవరైనా అడిగితే ఇప్పుడే ఫీల్డ్‌కు వెళ్లారు అని మిగతా సిబ్బంది సమాధానం చెప్పడం కనిపిస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయి దృష్టిసారించకపోవడంతో సచివాలయ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా పరిస్థితి మారింది. వారిని గాడినపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు.. ప్రజలకు అందుతున్న సేవలు.. సిబ్బంది సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' సోమవారం విజిట్ నిర్వహించింది. ఈ పరిశీలనలో పలు విషయాలు వెలుగుచూశాయి. జిల్లాలో 732 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 75 వార్డు, 657 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. కొద్దినెలల కిందట ప్రభుత్వం రేషనలైజేషన్ నిర్వహించి సచివాలయ సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించింది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్ణయం తీసుకుంది. 732 సచివాలయాలకు మొత్తం 7,200 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ 6,416 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 700పైబడి పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పట్టణాల్లో వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్‌లు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ సచివాలయాలను ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారు. ఇతర ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతగా లేదు. 8 నుంచి 10 మంది సిబ్బందికి గాను కేవలం ఇద్దరు.. ముగ్గురు మాత్రమే ఉంటున్నారు. సమయపాలన పాటించకపోవడం పలు చోట్ల కనిపించింది. ఇతర ప్రభుత్వ విభాగాల మాదిరిగా సచివాలయాల్లోనూ డెప్యుటేషన్ నడుస్తోంది. పలుకుబడి కలిగినవారు... ఉన్నతాధికారుల మెప్పు పొందినవారు.. ఇతరత్రా కారణాలు.. సిఫారసులతో డెప్యుటేషన్‌పై ఇతర కార్యాలయాలకు వెళ్లిపోతున్నారు. దీనివల్ల ప్రజలకు గ్రామాల్లో సరిగ్గా సేవలందడం లేదు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా పరిషత్ సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో సచివాలయాల సిబ్బంది కొంతమంది కలెక్టరేట్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని సచివాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## కార్యకర్తలే పార్టీకి వెన్నుముక: పల్లా




**గాజువాక, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీలో వున్న ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా వుంటాదని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ నూతన కమిటీల ప్రమాణ స్వీకార మహెూత్సవం కి ముఖ్యఅతిధి గా పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా తెలుగుదేశం పార్టీ జండాను పల్లా శ్రీనివాసరావు ఎగరవేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ పార్టీలో నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు తన అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తాదని హామీ ఇచ్చారు. విశాఖ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విశాఖ నగరాన్ని ప్రపంచమంతా చూసేలా కోటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సంపద సృష్టించి నవ్యాంధ్రప్రదేశ్ని స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు తీసుకెళ్లడమే చంద్రబాబు యొక్క లక్ష్యం అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేలా వైకాపా పార్టీ విష ప్రచారాన్ని చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు వైకాపా పార్టీని 11 సీట్లకి పరిమితం చేసిన బుద్ధి రాలేదని విమర్శించారు.కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాస్, మొల్లి ముత్యాల నాయుడు, పల్లా శ్రీనివాస్, నరసింహ పాత్రుడు, రాజాన రామారావు, నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ విద్యార్థి సృజన్ కుటుంబీకుల ఆందోళన




**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండల పరిధిలో జడ్చుర్ల ట్రిపుల్ ఐటీ కళాశాలలో మృతి చెందిన సృజన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమారుని కొంత మంది విద్యార్థులు కొట్టి చంపాలని ఆరోపించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న సి.ఐ. అవతారం, ఎస్సై సందీప్ కుమార్ తో పాటు మరికొందరు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వ్యక్తిపై క్యాంపస్ విద్యార్థులు అబాండాలు వేసి సమస్యను దారి మళ్ళిస్తున్నారని ఆరోపించారు. జరిగినటువంటి సంఘటనపై యాజమాన్యం పోలీసులు సమగ్ర విచారణ చేసి ఆ విద్యార్థికి న్యాయం చేయాలని బైఠాయించారు. న్యాయం జరిగితేనే ఇక్కడ నుండి కదిరి లేదంటూ స్పష్టం చేశారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న శ్రీకాకుళం డిఎస్పి వివేకానంద కుటుంబ సభ్యులతో, విద్యార్థులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

## అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అంగన్వాడి సెంటర్లో బలోపేతం చేయాలని ఐసిడిఎస్ కు నిధులు పెంచాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లల్ని అంగన్వాడీ సెంటర్లలో ఉంచే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని అదనపు పనులను అప్పగించకూడదని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 14 న సచివాలయాలు, డిసెంబర్ 12న జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని గురువారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం దుర్గారాణి అధ్యక్షతన దొడ్డి రామానాయుడు భవనంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు మాట్లాడుతూ ఐసిడిఎస్ పెట్టిన లక్ష్యం నిర్వీర్యం అవుతుందని ప్రీస్కూల్ నిర్వహణకు అడ్డంకిగా అనేక పనులను అప్పగిస్తున్నారని, ఆన్లైన్ పనులతో పని భారం విపరీతంగా పెరిగిందని సెంటర్లో పిల్లలకు పాఠాలు చెప్పడానికి సమయం ఉండడం లేదని, ఆన్లైన్ పనులతో ఇబ్బంది పడుతున్నారని, ప్రీ స్కూల్ కి వస్తున్న పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలని ప్రైవేటు స్కూల్లో ఆరు సంవత్సరాల్లో పిల్లల్ని జాయిన్ చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ స్కూల్లో బ్రిడ్జి చేసే పని ఆపాలని, పిల్లలకి ఇస్తున్న మెనూ పెంచాలని, అంగన్వాడీల నిర్వహణకు కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలని కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న సచివాలయాల వద్ద డిసెంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వివి రమణమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి, సత్యవేణి, భవాని, జయలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

## కుస్తీ పోటీల్లో సత్తాచాటిన కొయ్యూరు ఎపిటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు ఎపిటీడబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాల(బాలురు) విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. విజయవాడలో నవంబర్ 28న జరిగిన అండర్-19,అండర్-17 విభాగాల కుస్తీ పోటీల్లో కళాశాల విద్యార్థులు పతకాలు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు.ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సిహెచ్. కార్తీక్, ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జి. దుర్గ ప్రసాద్ బంగారు పథకాలు గెలుచుకోగా.ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కె.జయరాం,కె. రామదాసులు రజత పథకాలు సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. లక్ష్మణుడు,వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.అచ్చన్న, పీడీ ఉదయ్,బోధన సిబ్బంది విద్యార్థులను అభినందించారు.పతకాలు సాధించిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయండి




**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:** వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ, జిల్లా నీటి విడుదల, పారిశుధ్య పనులపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి తాగునీటి కనెక్షన్ ఇప్పించాలన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం వాటర్ డ్రాయల్‌లో భాగంగా 1.865 టిఎంసి నీటిని కేటాయించేలా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో రాష్ట్రానికి కేటాయించిన132 టీఎంసీలలో అనుమతులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర రహదారులు, అటవీశాఖ, మైనింగ్ అంశాలపై సమీక్షించారు. జెడ్‌పి సిఇఒ జ్యోతిబసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ చంద్రశేఖర్, డిపిఒ నాగేశ్వరరావు నాయక్, డిఇఒ ఎల్.చంద్రకళ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, భూగర్భ జల శాఖాధికారి రామ్‌బాలాజీరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు, ఆర్.అండ్.బి ఇఇ గీతారాణి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ముత్తయ్య పాల్గొన్నారు. అనంతరం నరసరావుపేట మండల పరిధిలో మహిళలు తాగునీటి నాణ్యత పరీక్షలపై కలెక్టర్‌కు ప్రజెంటేషన్ ఇచ్చారు.

# ఢిల్లీ పేలుళ్ల కేసు: పగలు డాక్టర్.. సాయంత్రం 4 తర్వాత టెర్రరిస్ట్.. షహీన్ సయీద్ డబుల్ లైఫ్ బట్టబయలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ షహీన్ సయీద్ పగలు వైద్యురాలిగా పనిచేస్తూ, సాయంత్రం కాగానే ఉగ్రవాద కార్యకలాపాల్లో మునిగి తేలేదని విచారణలో తేలింది. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు ఫరీదాబాద్‌లోని అల్-ఫలా మెడికల్ సైన్సెస్ కాలేజీలో తన ఉద్యోగం ముగిశాకే, తన 'అసలు పని' మొదలవుతుందని షహీన్ తరచూ చెప్పేదని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఎన్డీటీవీ కథనం ప్రకారం, షహీన్ ప్రవర్తన చాలా విచిత్రంగా ఉండేదని ఆమె సహోద్యోగి ఒకరు తెలిపారు. ఆమె ఎప్పుడూ తన వెంట ప్రార్థనలకు ఉపయోగించే తస్బీహ్ (జపమాల), హదీస్ పుస్తకాన్ని ఉంచుకునేదని, సంస్థ నిబంధనలను పాటించకుండా ఎవరికీ చెప్పకుండానే తరచూ బయటకు వెళ్లిపోయేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సదరు విద్యాసంస్థ, షహీన్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్‌ఉగ్రవాద సంస్థ మహిళా విభాగానికి షహీన్ హెడ్‌గా పనిచేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. లక్నో నివాసి అయిన షహీన్‌ను సోమవారం అరెస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే, ఉమర్ మహమ్మద్ అనే మరో ఉగ్రవాది ఎర్రకోట వద్ద పేలుడు పదార్థాలతో నింపిన హ్యుందాయ్ ఐ20 కారుతో ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో షహీన్ కాన్పూర్ మెడికల్ కాలేజీ, కన్నౌజ్ మెడికల్ కాలేజీలలో ఫార్మాకాలజీ విభాగాధిపతిగా కూడా పనిచేసింది. ఈ కేసులో షహీన్‌కు ముందే డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ ఆదిల్ అహ్మద్‌లను అరెస్ట్ చేయడం 'వైట్ కాలర్ టెర్రరిజం' కోణాన్ని తెరపైకి తెచ్చింది. ఉగ్రకుట్రకు ఉపయోగించిన రెండు కార్లను షహీన్ పేరు మీదే గుర్తించారు. అసాల్ట్ రైఫిల్, బుల్లెట్లు లభించిన మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారును షకీల్ వాడగా, బాంబు డెలివరీ కోసం సిద్ధం చేసిన మారుతీ బ్రెజాను షహీన్ స్వయంగా నడిపేదని అధికారులు తెలిపారు. దేశ రాజధాని సహా పలు ప్రాంతాల్లో వరుస పేలుళ్లకు ఈ ముఠా భారీ ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఏకంగా 32 కార్లను సిద్ధం చేసినట్లు సమాచారం. బుధవారం మరో ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల రవాణాకు దీన్ని వాడినట్లు ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. ఈ కుట్ర వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారణను ముమ్మరం చేశాయి.

# నేటి ఉదయం 8 గంటలకు జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు: రిటర్నింగ్ ఆఫీసర్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని రిటర్నింగ్ ఆఫీసర్ కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మంగళవారం ముగిసింది. రేపు ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్వో కర్ణన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన అన్నారు. రేపు ఉదయం పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తామని వెల్లడించారు. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తామని ఆర్వో కర్ణన్ తెలియజేశారు. కౌంటింగ్ కోసం మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తామని అన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామని అన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

# విశాఖ, విజయవాడ మెట్రో రైలు -ప్రజా రవాణా దుస్థితి



**విశాఖపట్నం, విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ నిర్మాణానికి పూనుకుంది. ఇప్పటికే సవివర ప్రాజెక్టు రిపోర్టులు (డిపిఆర్) తయారుచేసి టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. వాస్తవానికి రాష్ట్రంలోని ఈ రెండు నగరాల్లో మెట్రో రైళ్ల నిర్మాణ ప్రతిపాదనలు గత పదేళ్ల నుండి కొనసాగుతున్నాయి. రకరకాల మెట్రో ప్రాజెక్టుల రిపోర్టులను మార్చి మార్చి తయారు చేశారు. కానీ అడుగు ముందుకు పడలేదు. మొదటి దశగా విశాఖపట్నంలో 46.23 కిమీ కారిడార్లు మూడు, విజయవాడలో 38.4 కిమీ కారిడార్లు రెండు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించాలని నిర్ణయించారు. విశాఖ మెట్రో రైలుకు రూ.11,498 కోట్లు, విజయవాడ మెట్రో రైలుకు రూ.10,118 కోట్లు వ్యయం అవుతుందని తేల్చారు. ఈ నిధులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరొక 20 శాతం చొప్పున భరించేలా, మిగిలిన 60 శాతం అంతర్జాతీయ సంస్థల నుండి రుణ రూపంలో సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వ్యయంతో పాటు భూ సేకరణ కోసం విశాఖలో 100 ఎకరాలకు రూ.882 కోట్లు, విజయవాడలో 91 ఎకరాల కోసం రూ.1152 కోట్లు, రెండు చోట్లా మెట్రో రైల్ నిర్మాణ పనుల పర్యవేక్షణ సాంకేతిక సహకారం కోసం కన్సల్టెన్సీ సంస్థలకు రూ.401 కోట్ల ఫీజు చెల్లించనున్నారు. మొత్తంగా రెండు నగరాల్లో అన్నీ కలిపి మెట్రో రైల్ నిర్మాణం కోసం రూ.24,051 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.మెట్రో నిర్మాణం పనులు (సివిల్ వర్క్స్) డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్, ఫ్లై ఓవర్, ఎలివేటెడ్ మెట్రోస్టేషన్లు తదితర వాటి నిర్మాణాల కోసం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ఖర్చవుతుందని%ా% దీనిలో విశాఖ మెట్రో రైల్‌కు రూ.4,101 కోట్లు, విజయవాడ మెట్రో రైల్‌కు రూ.3,497 కోట్లుగా నిర్ణయించారు. ఈ నిధులను విశాఖ మెట్రోపాలిటన్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (వి.ఎం.ఆర్.డి.ఏ) 1941 ఎకరాలు అమ్మి సేకరించాలి. ఈ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుండి సేకరించి సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ) అమరావతి లోని భూముల అమ్మకం ద్వారా వచ్చే సొమ్ము నుండి కేటాయించాలని కోరింది. మిగిలిన 60 శాతం నిధులను మెట్రో రైలు పట్టాలు, సిగల్ వ్యవస్థ, రైలు కోచ్‌లు, ఇంజిన్లు, విద్యుత్, కమర్షియల్ కాంప్లెక్సులు, పార్కింగ్ వంటి వాటికి ఖర్చు చేస్తారు. ఈ 60 శాతం అనగా రూ.12,729 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థల నుండి రుణ రూపంలో సేకరించి ప్రైవేటు సంస్థకు ఇవ్వాల్సి ఉంటుంది. 2014 రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని పేర్కొనబడింది. ఏడాది లోపు ఫీజబిలిటీ నివేదికను కూడా తయారు చేసి కేంద్రానికి పంపాలని చట్టంలో ఉంది. దీని ప్రకారం మొత్తం రెండు నగరాల్లో చేపట్టే మెట్రో రైలు నిర్మాణ ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో భరించాల్సి ఉంటుంది. కేవలం రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం మాత్రమే నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కానీ ప్రాజెక్ట్ నివేదికలు తయారు చేసి కేంద్రానికి పంపడం వరకే తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు పరిమితం అయ్యాయి. కేంద్ర బడ్జెట్లలో వీటికి నిధులివ్వక పోయినా నోరు మెదపలేదు. ఆ తరువాత 2017 నూతన మెట్రో రైలు విధానం అమలులోకి వచ్చిందని, ఈ విధానం వల్ల విశాఖ, విజయవాడ మెట్రో రైలు నిర్మాణం 90 శాతం నిధులు ఇవ్వటం సాధ్య పడదని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదే పదే చెప్పినా ఏమాత్రం స్పందించకుండా బిజెపి కి దాసోహం అయ్యారు. మెట్రో రైలు విషయంలోనే కాదు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు వంటి అనేక చట్టబద్ధ హామీల మీద కేంద్ర బిజెపి కి లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారు. ఇంకా బిజెపి తోనే పెనవేసుకుపోతున్నారు. ఇప్పటికీ ఈ రెండు నగరాల మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపలేదు. నిధులు ఇస్తానని ప్రకటన కూడా చేయలేదు.దేశంలో తొలిసారిగా 1984లో కలకత్తాలో ఆ తరువాత 2002లో ఢిల్లీలో మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను నిర్మించారు. ఈ రెండూ పూర్తిగా ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మితమైనవి. జైపూర్ మెట్రో, ముంబై మోనో రైలు పూర్తిగా ఆ రాష్ట్ర ప్రభుత్వాలే సొంత నిధులతో నిర్మించాయి. ముంబై, చెన్నై, బెంగళూరు, నాగపూర్, లక్నో, కోచి, అహ్మదాబాద్ నగరాల మెట్రోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో జాయింట్ వెంచర్ మోడల్ లో ఏర్పాటు చేశారు. ఆతర్వాత చేపట్టిన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం పూర్తిగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి)లో చేపట్టారు. ఈ నమూనాలో కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రాజెక్ట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద 20 శాతం మాత్రమే నిధులు ఇస్తుంది. ఇప్పుడు ఈ మోడల్ లోనే విశాఖ, విజయవాడ రెండు నగరాల్లో చేపట్టే మెట్రోలకు 20 శాతం చొప్పున కేంద్రం నిధులిస్తుంది. 2025 ఆగస్టు నాటికి దేశంలో 23 నగరాల్లో 1,013 కిమీ పొడవైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడింది. అయితే ఎక్కువ మెట్రోలు నష్టాల్లో నడుస్తున్నాయి.ఈ మెట్రోలలో రోజులో ప్రయాణం చేస్తారని అంచనా వేసిన ప్రయాణీకుల (రైడర్స్) సంఖ్య కంటే కేవలం 20 నుండి 30 శాతం మించి ప్రయాణం చేయడం లేదు. ఒక్క ఢిల్లీ మెట్రోలోనే అంచనాలో 47 శాతం ప్రయాణం చేస్తున్నారు. ముంబైలో 30 శాతం, బెంగళూరులో 16 శాతం, లక్నో, జైపూర్, కాన్పూర్ వంటి నగరాల మెట్రోలో కేవలం 3 నుండి 4 శాతం లోపే ప్రయాణీకులు ప్రయాణం చేస్తున్నారు. ఇప్పుడు విశాఖ మెట్రోలో రోజుకి 5 నుండి 6 లక్షలు, విజయవాడ మెట్రోలో 4 నుండి 5 లక్షలు జనం ప్రయాణం చేస్తారని డిపిఆర్ నివేదికల్లో భారీ అతి అంచనాలు పేర్కొన్నారు.ఇటీవలే హైదరాబాద్ నగరంలో ఉన్న మెట్రో రైలు నిర్వహణ చేయలేక, చేసిన అప్పులు తీర్చలేక చేతులెత్తేసి నిర్వహణ నుండి ఎల్ అండ్ టి సంస్థ తప్పుకుంది. దేశంలో తొలిసారిగా పిపిపి మోడల్‌లో రూ.22 వేల కోట్ల పెట్టుబడితో 2010లో హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం ఎల్ అండ్ టి చేపట్టింది. 2017లో మూడు కారిడార్లతో 69 కిమీ మేర మెట్రో సదుపాయం ప్రారంభం అయ్యింది. నిర్దేశించుకున్న ప్రాజెక్ట్ వ్యయంకు అదనంగా 70 శాతం పెరగడం, నిర్వహణకు తగిన విధంగా ఆదాయం రాకపోవడం, ప్రయాణీకులు తగినంత లేకపోవడం, తీసుకొచ్చిన అప్పులు పెరిగి 13 వేల కోట్లకు చేరాయి. ఈ పరిస్థితుల్లో మెట్రో నిర్వహణా బాధ్యత నుండి తప్పుకుంది. ఇప్పుడు ఎల్ అండ్ టి ఈక్విటీని తెలంగాణ ప్రభుత్వం టేకోవర్ చేసి నిర్వహణా బాధ్యతను తీసుకోవాల్సి వచ్చింది. రెండో దశ చేపట్టాల్సిన మెట్రో కూడా నిలిచిపోయింది. ఇప్పుడు ఇదే తరహా పిపిపి విధానాన్ని విశాఖ, విజయవాడలో కూటమి ప్రభుత్వం అమలు చేయబోతున్నది. విశాఖపట్నం జనాభా ప్రస్తుతం 25 లక్షలు కాగా విజయవాడ నగర జనాభా 14 లక్షలకు చేరింది. రాష్ట్రంలో అతి పెద్ద మొదటి, రెండో నగరాలుగా ఉన్నాయి. ఇప్పుడు నిర్మాణం తలపెట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు వల్ల ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు ప్రజల ప్రయాణ కష్టాలు తీరతాయా? హైదరాబాద్ మెట్రో రైలు కేవలం 3 శాతం ప్రజల రవాణా అవసరాలను మాత్రమే తీరుస్తున్నది. ఇటీవల మెట్రో టికెట్ చార్జీలను భారీగా పెంచడం తో ప్రయాణీకులు మరింత తగ్గిపోతున్నారు. అదేగాక నేడు మెట్రోలో ఎక్కువగా మధ్య తరగతి ఆదాయ వర్గాల వారు, చదువుకున్న యువతీ యువకులు తదితరులే ప్రయాణం చేస్తున్నారు. ఎక్కువమంది బస్సులు, ఆటోలు, సొంత వాహనాల్లోనే ప్రయాణం సాగిస్తున్నారు. బస్సు చార్జీల కన్నా మెట్రో చార్జీలు రెండు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల సామాన్య, పేద వర్గాలు మెట్రోలో ప్రయాణం చేయలేకపోతున్నారు. కనుక మెట్రోలు నగరాల ప్రజా రవాణా సమస్యను పరిష్కరించలేవు. రాష్ట్రంలో ప్రజా రవాణా అభివృద్ధిపై పాలకులకు సమగ్ర ప్రజా దృక్పథం లేదు. ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి తగిన విధంగా కనీస స్థాయిలో కూడా నిధులు కేటాయించడం లేదు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు కూడా నేడు 10,035 తగ్గిపోయాయి. కొత్తగా కేంద్రం నుండి వస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ పరం చేస్తున్నారు. దీంతో పట్టణ లేదా రాష్ట్ర జనాభా ప్రైవేట్, వ్యక్తిగత రవాణా మీద ఆధారపడటం పెరిగిపోతున్నది. వాస్తవంగా జాతీయ పట్టణ రవాణా విధానం-2014 ప్రకారం నగరాల్లో ప్రతి లక్ష మంది ప్రజలకు 60 బస్సులు ఉండాలి. ఈ లెక్కన విశాఖలో 1500, విజయవాడలో 840 బస్సులు ఉండాలి. ప్రస్తుతం విశాఖపట్నంలో 600, విజయవాడలో 400 ఆర్‌టిసి బస్సులు మాత్రమే ఉన్నాయి. ఇటీవల ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఉన్న బస్సుల్లో మరింత రద్దీ పెరిగిపోతున్నది. రెండు నగరాల మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,051 కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రెండు నగరాలకు కనీసం 2వేల కోట్లు కేటాయించి నట్లయితే విశాఖకు మరో 900, విజయవాడకి 450 ఎలక్ట్రిక్ బస్సులు అదనంగా సమకూరేవి. ప్రజా రవాణా సదుపాయం మూడు రెట్లు అదనంగా పెరిగేది. ప్రజా రవాణా అనేది అత్యధిక ప్రజలు ఆధారపడే ప్రజా సేవా రంగం. నగర ఆర్థిక, ప్రజల సామాజిక జీవితంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. నయా ఉదారవాద విధానాలను అవలంభించడం మొదలెట్టాక ప్రజా రవాణా వ్యవస్థను పెద్దఎత్తున ప్రైవేటీకరిస్తున్నారు. ప్రైవేట్ పెట్టుబడిని చొప్పిస్తున్నారు. కేంద్ర పట్టణ మంత్రిత్వ శాఖ పట్టణ ప్రజా రవాణ మెరుగుదల చేసే నిధుల్లో 47 శాతం మెట్రో రైలు నిర్మాణాలకే కేటాయిస్తున్నారు. ప్రజల కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన ప్రజా రవాణా, మౌలిక సదుపాయాలను కార్పొరేట్ శక్తుల లాభాల కేంద్రంగా అతి కొద్ది మందికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందిస్తున్నారు. ప్రజా వనరులను కొల్లగొడుతూ సొంత ఆస్తులుగా మార్చుకుంటున్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పోకడలు తీవ్రమయ్యాయి. ఈ చర్యలు రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా రవాణా అభివృద్ధిని మరింత దెబ్బ తీయబోతున్నాయి.

# చైనాకు ప్రత్యామ్నాయం తెలంగాణనే: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ప్రపంచ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, భద్రత, భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ) పాల్గొన్న సీఎం, "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌ను ఆవిష్కరించి, రాష్ట్రంలోని అవకాశాలను వివరించారు. దేశంలోనే అత్యధిక యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ దూసుకుపోతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ అధికారంలో ఉన్నా, పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, ఈ విషయంలో రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉందని ఆయన గుర్తుచేశారు. అందుకే భారత్‌లో పెట్టుబడులకు హైదరాబాద్‌ను ముఖద్వారంగా చూడాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, అత్యున్నత జీవన ప్రమాణాలతో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడమే తన ప్రథమ ప్రాధాన్యత అని సీఎం వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న పలు కీలక ప్రాజెక్టుల గురించి ఆయన ప్రస్తావించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన "భారత్ ఫ్యూచర్ సిటీ" దేశంలోనే ఒక నూతన నగరంగా నిలుస్తుందన్నారు. మూసీ నది పునరుజ్జీవనం పూర్తయితే లండన్, దుబాయ్, టోక్యో నగరాల తరహాలో హైదరాబాద్‌లో నైట్ ఎకానమీ కొత్త రూపు సంతరించుకుంటుందని తెలిపారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో పాటు "చైనా ప్లస్ వన్" మోడల్‌కు ప్రపంచవ్యాప్త సమాధానం తెలంగాణనే అవుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొన్ని ఆసక్తికరమైన ప్రతిపాదనలు చేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రఖ్యాత ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, గ్లోబల్ సౌత్ దేశాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు. అదేవిధంగా, హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే సంప్రదాయాన్ని మార్చి, గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి గ్లోబల్ కంపెనీల పేర్లను పెడతామని ఆయన చేసిన ప్రకటన సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగానికి, ఆయన ఆవిష్కరించిన విజన్‌కు అంతర్జాతీయ వ్యాపార వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. టెక్ దిగ్గజం, సిస్కో మాజీ సీఈఓ జాన్ చాంబర్స్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ చాలా సాహసోపేతంగా, స్పష్టంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు ఎంతో ప్రేరణ కలిగించాయి," అని ప్రశంసించారు. సీఎం ఆహ్వానం మేరకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే "తెలంగాణ రైజింగ్" గ్లోబల్ సమ్మిట్‌కు అత్యధిక సభ్యులతో హాజరవుతామన్నారు.

# చెవిలో 'గులిమి' తీయాల్సిందేనా?

## నిపుణులు ఏమంటున్నారంటే!




జ్ఞానేంద్రియాలలో చెవికి చాలా ప్రత్యేకమైన స్థానం ఉంది. చెవి బయట నుంచి వచ్చే సూక్ష్మజీవులు లోపలికి పోకుండా గులిమి స్రవిస్తుంది. అయితే, ఈ విషయం తెలియక చాలామంది చెవిలో ఏదో ఒకటి పెట్టి గులిమిని బయటకు తీసేయాలని అనుకుంటారు. ఫలితంగా చెవి నొప్పి, ఇన్ఫెక్షన్స్, వినికిడి లోపం వంటి సమస్యలను కోరితెచ్చుకుంటారు. అయితే, మనం ఆహారం తినేటప్పుడు దవడలు కదలడం ద్వారా చెవిలో ఉండే గులిమి వాటంతట అదే బయటకు పోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో చెవిలో గులిమి ఉంటే తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలను సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

గులిమి తీస్తేనే చెవులు శుభ్రంగా ఉంటాయని కొంతమంది భావిస్తుంటారు. ఇది నిజం కాదని, చాలామందికి దానంతటదే బయటకు వస్తుందని ప్రముఖ సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డా. ఎన్. విష్ణుస్వరూప్ రెడ్డి అంటున్నారు. చెవి మార్గంలోని ప్రత్యేక చర్మం గులిమిని బయటకు తోస్తూ, ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుందని చెబుతున్నారు. అందువల్ల తీయాల్సిన పనిలేదని సూచిస్తున్నారు. చెవి మార్గం ముందుభాగంలోని వెంట్రుకలు, సెబేషియస్ గ్రంథుల నుంచి వెలువడే స్రావాలతో గులిమి తయారవుతుందని చెబుతున్నారు. ఇది లోపలి భాగాన్ని తడిగా ఉంచుతూ, మార్గం ఎండిపోకుండా చూస్తుందని పేర్కొంటున్నారు. దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా, క్రిముల వంటివి లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటుందని అధ్యయనం పేర్కొంది. మృతకణాలు, వ్యర్థాలను తనలో కలిపేసుకుంటుందని వివరిస్తున్నారు. అంటే, చెవికి సహజ రక్షణ కవచంగా నిలుస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఈ క్రమంలో కొంతమందికి చెవిలో గులిమి ఎక్కువగా తయారవ్వచ్చని డా. విష్ణుస్వరూప్ రెడ్డి అంటున్నారు. కొంతమందికి ఇది చాలా జిగురుగా, మరికొందరికి గట్టిగానూ ఉండొచ్చని వివరిస్తున్నారు. ఏదేమైనా దీన్ని ప్రత్యేకించి తీయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అగ్గిపుల్లలు, పిన్నీసులు, కాటన్ బడ్స్ వంటివి చెవిలో పెట్టి తిప్పితే గులిమి ఇంకా లోపలికి పోయే ప్రమాదముందని తెలియజేస్తున్నారు. దీంతో చెవిలోని చర్మం, కర్ణభేరి దెబ్బతినొచ్చని హెచ్చరిస్తున్నారు.

చాలా తక్కువ మందిలో చెవిలో గులిమి లోపల పోగవ్వచ్చని, వీరిలో 1-2 శాతం మందికి గట్టిపడి, చెవి మార్గం నిండిపోవచ్చని పేర్కొంటున్నారు. ఇలాంటి వారికే గులిమి తీయాల్సి వస్తుందని, అదీ కూడా ఈఎన్?టీ నిపుణులతోనే తీయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి ముందుగా వారం పాటు రోజుకు మూడు సార్ల చొప్పున చెవిలో చుక్కల మందు లేదా గోరువెచ్చగా చేసి చల్లార్చిన ఆలివ్ నూనె వంటివి వేస్తారని తెలియజేస్తున్నారు. గులిమి మెత్తబడ్డాక మైక్రోస్కోపిక్ వ్యాక్యూమ్ సక్షన్‌తో జాగ్రత్తగా బయటకు తీస్తారని చెబుతున్నారు. అలా కాకుండా, కొన్ని చోట్ల చెవిలోకి సిరంజితో నీటిని బలంగా పంపించి, గులిమి బయటకు వచ్చేలా చేస్తుంటారని అంటున్నారు. ఇది సురక్షితమైన పద్ధతి కాదని, దీంతో కొన్ని సార్లు కర్ణభేరి దెబ్బతినొచ్చని హెచ్చరిస్తున్నారు. అప్పటికే కర్ణభేరికి రంధ్రం ఉన్నట్టయితే హానికరకాలు లోపలి చెవికి చేరుకొని ఇన్‌ఫెక్షన్, నొప్పి, చీము కారటం వంటివి తలెత్తే ప్రమాదమూ ఉంటుందని వివరిస్తున్నారు.



# అలోవేరా జెల్ రాస్తే నల్లని వలయాలు తగ్గుతాయా

ఆయుర్వేద గుణాలు ఉండే అలోవెరా వల్ల చాలా ప్రయోజనాలు మనకి లభిస్తాయి. పైగా అలోవెరా మన ఇంట్లోనే దొరుకుతుంది. దీని కోసం మనం పెద్దగా కష్ట పడక్కర్లేదు కూడా. అలోవెరాని అప్లై చేసుకోగానే ఎంతో చల్లగా ఉంటుంది. అదే విధంగా ఎన్నో చర్మ సమస్యలను అది పోగొడుతుంది. యాక్నే మొదలు చర్మం రంగు మార్చడం వరకు ఎన్నో ప్రయోజనాలు కలబందతో మనకి వస్తాయి. చర్మ సమస్యలకు నిజంగా అద్భుతమైన పదార్థం అని చెప్పొచ్చు. అయితే చాలా మంది అలోవెరాని ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. కానీ దీని వల్ల కలిగే లాభాల గురించి తెలియదు. మరి ఆలస్యం ఎందుకు వాటి కోసం చూద్దాం.%వేసుకునే మందులు అసలా.. నకిలీనా.. ఇలా తెలుసుకోండి..

అలోవెరా ఉపయోగించడం వల్ల చర్మం, జుట్టు కూడా ఎంతో అందంగా మారుతుంది. అలోవెరా జ్యూస్‌ని కూడా చాలా మంది తాగుతూ ఉంటారు. దీని వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు కలబందతో ఎన్నో ప్రయోజనాలు మనం పొందొచ్చు. ఇక వాటి కోసం చూస్తే... డార్క్ సర్కిల్స్‌తో చాలా మంది ఇబ్బంది పడుతూ ఉంటారు. మీరు కూడా డార్క్ సర్కిల్స్‌తో ఇబ్బంది పడుతున్నారా..? అయితే తప్పకుండా కలబందని ఉపయోగించండి. అయితే ఈ డార్క్ సర్కిల్స్ ఎలా వస్తాయి అనేది చూస్తే.. డార్క్ సర్కిల్స్ అనేవి ఒత్తిడి, నిద్ర లేకపోవడం మరియు ఎక్కువ కెఫిన్ తీసుకోవడం కారణంగా వస్తాయి.

అటువంటి వాళ్లు డార్క్ సర్కిల్స్ పోవడానికి అలోవెరా గుజ్జుని అప్లై చేసుకోండి. దీంతో ఈజీగా ఈ సమస్య నుండి బయట పడిపోవచ్చు. దీని కోసం మీరు రాత్రి నిద్రపోయే ముందు కలబంద మట్ట తీసుకుని దాని నుండి గుజ్జు తీసి... మీ డార్క్ సర్కిల్స్‌పైన అప్లై చేయండి. అయితే ఇలా అప్లై చేసిన తర్వాత వెంటనే కడిగేసుకోకుండా. రాత్రంతా అలానే వదిలేయండి. ఆ తర్వాత ఉదయాన్నే వాష్ చేయండి. ఇలా చేయడం వల్ల డార్క్ సర్కిల్స్ మాయమైపోతాయి. కాబట్టి ఈ చిన్న చిట్కాని పాటిస్తే త్వరగా డార్క్ సర్కిల్స్ బాధ నుండి బయట పడిపోవచ్చు.

అలోవెరాని ఉపయోగించడం వల్ల చర్మం అందంగా మారుతుంది. రంగు మారడానికి కూడా మీరు గమనించవచ్చు. అయితే దీని కోసం మీరు ఏం చేయాలంటే..? అలోవెరా గుజ్జు ముఖం మీద అప్లై చేయండి. దీనితో మీ చర్మం కాస్త తెల్లగా మారుతుంది. దీని కోసం మీరు రాత్రి పూట కలబంద గుజ్జు రాసుకుని ఉదయం కడిగేసుకుంటే మంచిది అని నిపుణులు సూచిస్తున్నారు. కనుక నిద్రపోయే ముందు కలబంద కొమ్మని తీసుకుని దానిలో నుండి గుజ్జు తీసేసి దానిని ముఖానికి అప్లై చేయండి. రాత్రంతా అలానే వదిలేసి ఉదయాన్నే గోరు వెచ్చని నీటితో ముఖాన్ని కడిగేయండి. ఈ విధంగా రెండు నుండి మూడు సార్లు వారానికి చేస్తూ ఉండండి. దీంతో మీకు చక్కని పరిష్కారం కనబడుతుంది. అలోవెరా చర్మం పై ఉండే వృద్ధాప్య ఛాయలను పోగొడుతుంది. అయితే వయసు పైబడే వారు ఈ చిట్కాలను పాటిస్తే సరిపోతుంది. అలోవెరా చర్మానికి నిజంగా ఎంతో మేలు చేస్తుంది. అలోవెరాలో విటమిన్ సి మరియు విటమిన్ ఈ ఉంటాయి.

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా గుజ్జులో కొద్దిగా పాలు పోసి ఒక టీ స్పూన్ తేనె కలిపి అప్లై చేసుకోవచ్చు. లేదంటే మీరు కాస్త రోజ్ వాటర్‌ని కూడా వేసుకుని అప్లై చేసుకోవచ్చు. ముఖానికి, మెడకి ఈ మిశ్రమాన్ని పట్టించి ఇరవై నిమిషాల పాటు అలాగే వదిలేసి ఆ తర్వాత గోరు వెచ్చని నీటితో ముఖాన్ని కడుక్కుంటే వృద్ధాప్య ఛాయలు రాకుండా ఉంటాయి. కనుక ఇది కూడా మీరు ట్రై చేయండి. దీనితో కూడా మీకు చక్కటి పరిష్కారం కనబడుతుంది. నేటి కాలంలో చాలా మంది యాక్నేతో బాధ పడుతున్నారు. ఈ సమస్యని తగ్గించుకోవడానికి ఎన్నో రకాల పద్ధతులను అనుసరిస్తారు. మీరు కూడా యాక్నె సమస్యతో బాధ పడుతున్నారా .?, ఈ సమస్యలు తగ్గించుకోవాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారా .అయితే మీకు కొన్ని చిట్కాలు. ఈ విధంగా కనుక మీరు అనుసరిస్తే తప్పకుండా యాక్నె సమస్య తగ్గుతుంది. దీని కోసం మీరు రెండు రెట్లు అలోవెరా జెల్ లో ఒక పోర్షన్ నీళ్ళు వేసి... దీనిని బాగా మిక్స్ చేసి ఒక స్ప్రే బాటిల్‌లో వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మీరు స్ప్రే చేసుకుంటూ ఉంటే ముఖమంతా కూడా చల్లగా ఉంటుంది. ఇలా యాక్నె కూడా తగ్గుతుంది. అయితే మీరు స్ప్రే చేసుకునే సమయంలో ఒకసారి బాటిల్ ని షేక్ చేసి ఆ తర్వాత ఉపయోగించండి. దీంతో మిశ్రమం బాగా కలిసి మంచిగా ప్రభావం చూపిస్తుంది. కనుక ఈ చిన్న టిప్ ని పాటిస్తూ ఉంటే మీ ముఖం మరెంత అందంగా ఉంటుంది. యాక్నే కూడా తగ్గిపోతుంది అని నిపుణులు చెప్పడం జరిగింది.

కచ్చితంగా రాత్రి నిద్ర పోయేటప్పుడు మేకప్ తీసి నిద్ర పోవాలి. లేదు అంటే చర్మ సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. మేకప్ ని ఇలా ఈజీగా అలోవెరాతో రిమూవ్ చేయొచ్చు. దీని కోసం మీరు ఒక టేబుల్ స్పూన్ అలోవెరా గుజ్జులో ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి ఈ మిశ్రమాన్ని బాగా కలిపి... కాటన్ బాల్ తో మేకప్ ని తొలగించొచ్చు.

# క్లీన్ ఎనర్జీ కోసం 'అసైన్డ్' భూములు

## నెడ్ క్యాప్ లేదా రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియ



**అమరావతి, పతాకం న్యూస్:** పేదల అసైన్డ్ భూములను కార్పొరేట్లకు అప్పచెప్పే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. రెండు రోజుల క్రితం అసైన్డ్ భూములను 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడానికి అవకాశం కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకేసింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అసైన్డ్ భూములను గుర్తించడంతోపాటు వాటిని ఏ అవసరాలకు వినియోగించాలో కూడా నిర్ణయించింది. విశ్వసనీయ సమాచారం మేరకు అసైన్డ్ భూములను పునరుత్పాదక (క్లీన్ ఎనర్జీ) ప్రాజెక్టులకు మాత్రమే లీజుకు ఇవ్వాలని ప్రస్తుతానికి నిర్ణయించారు. ఈ మేరకు క్షేత్రస్థాయి వరకు ఇప్పటికే సమాచారం కూడా వెళ్లింది. ఇలా లీజుకు ఇచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 26,43,500 ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నట్లు కూడా అధికారులు గుర్తించారు. అధికార యంత్రాంగం సేకరించిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 36,36,748 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఫ్రీ హోల్డ్‌కు అర్హమైన భూములు 13,62,345 ఎకరాలు ఉన్నట్లు గుర్తించగా, ఇప్పటికే 9,93,248 ఎకరాలను ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసింది. మొత్తమ్మీద విద్యుత్తు పునరుత్పాదక ప్రాజెక్టులకు లీజుకు ఇచ్చేందుకు 26,43,500 ఎకరాల భూములున్నట్లు అంచనా! ఈ భూములను సోలార్, విండ్, సిబిజి, పంప్డ్ స్టోరేజీ కంపెనీలకు మాత్రమే లీజుకిచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం ఇప్పటికే దిశా నిర్దేశం చేసింది. నెడ్ క్యాప్ ద్వారా లేదా ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్న రాష్ట్ర వ్యాప్త రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా ఇప్పటికే ఎక్కడెక్కడ పునరుత్పాదక విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చో ఆయా ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములుంటే వాటిని కేటాయిస్తారు. ప్రైవేటు భూములుంటే వాటిని కంపెనీలు కొనుగోలు చేయడం, లీజుకు తీసుకునే అవకాశం ఎలాగూ ఉంది. అసైన్డ్ భూములుంటే ఆర్డినెన్స్ జారీ అయిన అనంతరం వాటిని కూడా లీజుకు తీసుకునే అవకాశం కంపెనీలకు లభిస్తుంది. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం ఈ నెలాఖరుకు ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంది. లీజుకిస్తే ఎకరాకు 30 వేల నుంచి 40 వేల రూపాయల కౌలు వస్తుందని, ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం పెంచుతారని, లీజుకిచ్చిన కుటుంబంలో నిరుద్యోగి ఉంటే సంబంధిత కంపెనీలో ఉద్యోగం ఇస్తారని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ మేరకు ఇప్పటి వరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ కాలేదు. ఉత్తర్వులు వచ్చినా ఆచరణలో ఎంత మేరకు అమలవుతాయో వేచి చూడాల్సిందే.

పేదలకు లాభం చేకూర్చేందుకు రెవెన్యూ వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణల్లో భాగంగానే అసైన్డ్ భూములను లీజుకిచ్చేందుకు అనుమతులు ఇవ్వబోతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ చర్య వల్ల పేద, బడుగు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొంటూ బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాన్ని రెన్యూబుల్ ఎనర్జీ కేంద్రంగా మార్చడంలో పేద రైతులు భాగస్వామ్యులవుతారని, తద్వారా వచ్చే కంపెనీలు, ఫ్యాక్టరీల్లో పేద రైతుల పిల్లలకు ఉద్యోగాలు కూడా వస్తాయని, ఫలితంగా పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే చర్యల్లో ఈ నిర్ణయం ఒక భాగమని మంత్రి స్పష్టం చేశారు.

## డిజిటల్ మీడియా అడ్డగోలు ఉల్లంఘనలు




**ముంబై:** డిజిటల్ మీడియాలోనే అత్యధికంగా ప్రకటనల ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలానికి సంబంధించిన అర్థ వార్షిక కంప్లయింట్ నివేదికను ఎఎస్‌సిఐ వెల్లడించింది. ప్రపంచంలో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ఆధిపత్యాన్ని, అదే సమయంలో వాటిలో పెరుగుతున్న ఉల్లంఘనలను స్పష్టంగా ఎత్తి చూపింది. ఆ రిపోర్ట్ వివరాలు.. మొత్తం ప్రకటనల ఉల్లంఘన ఫిర్యాదులలో అత్యధికంగా 97 శాతం డిజిటల్ మీడియా నుంచే రావడం దిగ్భ్రాంతికరమైన విషయం. టివి, ప్రింట్ వంటి సాంప్రదాయ మాధ్యమాలలో కేవలం 3 శాతం కంటే తక్కువగా ఉల్లంఘనలు ఉండటం విశేషం. గత ఏడాదితో పోలిస్తే ఫిర్యాదుల సంఖ్య 70 శాతం పెరిగింది. ఇది ప్రకటనలపై వినియోగదారుల్లో పెరుగుతున్న అవగాహన లేమిని సూచిస్తుంది. అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న మెటాపై అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం ఉల్లంఘన లలో 79 శాతం మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ నుంచే వచ్చాయి. ఇతర వెబ్‌సైట్‌లపై 13.7 శాతం, గూగుల్‌పై 4.6 శాతం చొప్పున ఫిర్యాదులు అందాయి. చట్టవిరుద్ధమైన బెట్టింగ్, వ్యక్తిగత సంరక్షణ, ఆరోగ్య సంరక్షణ, ఆహారం, పానీయాలు, విద్యా రంగానికి చెందిన ప్రకటనలు 90 శాతం ఉల్లంఘనలకు కారణమయ్యాయి. దేశంలో చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్, జూదంపై అత్యధికంగా 4,578 ఫిర్యాదులు నమోదయ్యాయి. వ్యక్తిగత సంరక్షణ (367), ఆరోగ్యసంరక్షణ (332), పానీయాలు (211), విద్య (71) రంగాలపై ఫిర్యాదులు వచ్చాయి మొత్తంగా 6,117 ప్రకటనల ఫిర్యాదులపై విచారణ చేసింది. వీటిలో 98 శాతం వాటికి సవరణ అవసరమని గుర్తు చేసింది.

భారతదేశంలోని అగ్రశ్రేణి డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో 76 శాతం మంది తమ పెయిడ్ పార్ట్‌నర్‌షిప్ మార్గదర్శకాలను పాటించడం లేదు. ఇది వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఎఎస్‌సిఐ పేర్కొంది. "ఈ నివేదికలో డిజిటల్ ప్రకటనల పర్యవేక్షణలో ఉన్న సవాళ్లకు నిదర్శనం. చాలా మంది చిన్న స్థాయి ప్రకటనదారులు సరైన లీగల్ టీమ్‌లు లేకుండా పనిచేయడం, తక్కువ వ్యవధిలో ఎక్కువ డిజిటల్ క్యాంపెయిన్‌లు చేయడం వంటి కారణాల వల్ల ఉల్లంఘనలు పెరుగుతున్నాయి." అని ఎఎస్‌సిఐ సిఇఒ మనీషా కపూర్ పేర్కొన్నారు.ంది.




## పాక్-శ్రీలంక సిరీస్‌పై నీలినీడలు.. పర్యటన రద్దు చేసుకున్న 8 మంది లంక ఆటగాళ్లు



పాకిస్థాన్‌లో శ్రీలంక క్రికెట్ జట్టు పర్యటన తీవ్ర సంక్షోభంలో పడింది. ఇస్లామాబాద్‌లో మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడి నేపథ్యంలో భద్రతా కారణాలతో 16 మంది సభ్యుల జట్టులోని 8 మంది ఆటగాళ్లు స్వదేశానికి తిరిగి వచ్చేయాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామంతో పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరగాల్సిన వన్డే సిరీస్ రద్దయ్యే ప్రమాదం ఏర్పడింది. టెలికామ్ ఏషియా స్పోర్ట్ నివేదిక ప్రకారం రావల్పిండి వేదికగా ఈరోజు రెండో వన్డే జరగాల్సి ఉండగా, దానికి కొన్ని గంటల ముందే దేశం విడిచి వెళ్లాలని ఆటగాళ్లు నిర్ణయించుకున్నారు. తొలుత పాకిస్థాన్ అధికారులు భద్రతపై పూర్తి హామీ ఇవ్వడంతో పర్యటన కొనసాగించాలని భావించినా, జట్టు సభ్యులు హోటల్‌లో సమావేశమైన తర్వాత 8 మంది ఆటగాళ్లు తమ నిర్ణయాన్ని మార్చుకుని వెనుదిరగాలని పట్టుబట్టారు.పర్యటన నుంచి మధ్యలోనే వైదొలిగితే రెండేళ్ల పాటు నిషేధం విధిస్తామని శ్రీలంక క్రికెట్ బోర్డు హెచ్చరించినా ఆటగాళ్లు వెనక్కి తగ్గలేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బోర్డులోని కొందరు సభ్యులు భావిస్తున్నట్లు సమాచారం. పరిస్థితిని చక్కదిద్దేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్, ఆ దేశ మంత్రి మోహ్సిన్ నఖ్వీ రంగంలోకి దిగారు. ఆయన ఇస్లామాబాద్‌లోని హోటల్‌లో శ్రీలంక ఆటగాళ్లతో సమావేశమై పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాకిస్థాన్‌లోని శ్రీలంక హైకమిషనర్‌తోనూ చర్చలు జరిపారు. ఆయన పాక్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఆటగాళ్లలో భయాందోళనలు తగ్గలేదు.

## నేటి నుంచి టీమిండియా-దక్షిణాఫ్రికాతో

# టెస్టు సిరీస్ ప్రారంభం




14నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగే తొలిటెస్ట్‌లో చోటుకోసం రిషబ్ పంత్, ధృవ్ జురెల్ నెట్స్‌లో చెమటోడ్చి సాధన చేస్తున్నారు. మీడియా సమావేశంలో భారత ఫీల్డింగ్ కోచ్ ర్యాన్ డోస్చేట్ మాట్లాడుతూ.. వీరిద్దరూ తొలిటెస్ట్ బరిలో దిగడం ఖాయమని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో రిషబ్ పంత్ గాయపడి దీర్ఘకాలం తర్వాత జాతీయ జట్టులో చోటుకోసం ఎదురు చూస్తున్నాడని, దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన మ్యాచ్‌లో ధృవ్ జురెల్ సత్తా చాటాడని, ఈ క్రమంలో వీరిద్దరికీ చోటు దక్కకపోతే తాను ఆశ్చర్యానికి గురవుతానని తెలిపాడు. ఇటీవలకాలంలో జరిగిన ఐదు ఫస్ట్-క్లాస్ క్రికెట్ మ్యాచుల్లో ధృవ్ జురెల్ నాలుగు సెంచరీలతో రాణించాడని, దక్షిణాఫ్రికా-ఎపైనా రెండు శతకాలు బాదాడని ఈ సందర్భంగా గుర్తు చేశాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న జురెల్‌ను బెంచ్‌కే పరిమితం చేయాలని తాను కోరుకోవడం లేదని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా డోస్చేట్ తెలిపాడు. నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో అతడు బ్యాటర్ కోటాలో చోటు దక్కించుకోవడం ఖాయమని ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతని పేరు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నానన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 22ఏళ్ల నితీశ్ కుమార్ రెడ్డి ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడని, కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌల్ చేశాడని ఈ సందర్భంగా గుర్తు చేశాడు. విజయ్ హజారే వన్డే టోర్నీ బరిలో టీమిండియా స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ బరిలోకి దిగుతాడని ముంబయి చీఫ్ సెలెక్టర్ సూచన ప్రాయంగా తెలిపాడు. డిసెంబర్ 24 నుంచి జనవరి 8 వరకు జరిగే ఈ టోర్నీలో రోహిత్ శర్మ పాల్గొంటాడని, ఈ ఏడాది ప్రారంభంలో బిసిసిఐ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఆడకుండా ఉన్న పక్షంలో తప్పనిసరిగా దేశవాళీ లీగ్‌లలో తప్పనిసరిగా ఆడాలని నిబంధనను విధించడమే ఇందుకు ప్రధాన కారణం. దేశవాళీ లీగ్‌లలో ఆడేందుకు రోహిత్ శర్మ ముంబయిలోని శరద్ పవార్ ఇండోర్ అకాడమీలో బుధవారం నుంచి ప్రాక్టీస్ మొదలుపెట్టినట్లు సమాచారం.

డిసెంబర్ 3 నుంచి 9 వరకు జరగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్, జనవరి 11న ప్రారంభమయ్యే న్యూజిలాండ్ సిరీస్ మధ్య దేశీయ క్యాలెండర్‌లో ఈ మ్యాచ్ ఏకైక వన్డే. రోహిత్ శర్మ విజరు హజారే ట్రోఫీకి అందుబాటులో ఉంటానని ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కి తెలియజేసినట్లు సమా చారం. ఇక విరాట్ కోహ్లి కూడా దేశవాళీ లీగ్‌లలో ఆడాల్సి ఉంది. ప్రసుతం కోహ్లీ లండన్‌లో ఉన్నాడు. అతడు కూడా దేశీయ సర్క్యూట్‌లో ఆడాలని బోర్డు ఆదేశించింది. ఇద్దరు గత సీజన్‌లో ఇద్దరూ ఒక్కో రంజీ మ్యాచ్‌లో ఆడారు. జనవరిలో కోహ్లి 12ఏళ్ల తర్వాత ఢిల్లీ తరఫున, రోహిత్ 10ఏళ్ల తర్వాత ముంబయి తరఫున ఆడారు. అలాగే ఈ నెల 26న ప్రారంభం కానున్న ముష్తాక్ అలీ టి20 టోర్నీలో రోహిత్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ట్రయల్స్‌లో కోహ్లి, రోహిత్ పేర్లు పరిశీలనలో లేవని సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశారు. ఇద్దరు ఆటగాళ్లు ట్రోఫీల్లోనే కాదని.. పరుగులలో కూడా భారత క్రికెట్ కోసం చాలా చేశారన్నారు. రాబోయే ప్రపంచకప్ (2027) వరకు ఇంకా చాలా దూరం ఉందని.. వారు ఓ ఫార్మాట్‌లో ఆడుతూ సుదీర్ఘ విరామం తర్వాత దేశీయ మ్యాచ్‌లు ఆడుతూ ఉంటే వారి ప్రదర్శనను అంచనా వేస్తూనే ఉంటామన్నారు. 2027 నాటికి అనేక మార్పులు సాధ్యమేనని, అది కోహ్లి, రోహిత్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని, అప్పటికి చాలా మంది యువ ఆటగాళ్ల పరిస్థితి కూడా మారవచ్చని అగార్కర్ స్పష్టం చేశాడు. దేశీయ క్రికెట్‌లో పాల్గొనడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, టెక్నిక్‌ను పరీక్షిస్తుందని.. కోహ్లి, రోహిత్‌కు, దేశీయ క్రికెట్‌కు తిరిగి కేవలం లాంఛనప్రాయం కాకుండా.. ఇది వారి ఫామ్, భవిష్యత్తుకు కీలకంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నాడు.




# ‘గ్లోబ్ ట్రాటర్’ నుంచి ప్రియాంక చోప్రా డైనమిక్ లుక్



సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్... సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న ‘గ్లోబ్ ట్రాటర్’ సినిమా నుంచి ఓ అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. ఈ చిత్రంలో ‘మందాకిని’ అనే పాత్రలో ప్రియాంక కనిపించనున్నారు. ఆమె వస్తోంది... ఆమే మందాకిని అనే క్యాప్షన్‌తో దర్శకుడు రాజమౌళి తన సోషల్ మీడియా ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ లుక్‌లో ప్రియాంక చోప్రా చీరకట్టులో, హీల్స్ ధరించి, చేతిలో పిస్టల్ తో ఎంతో డైనమిక్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. ఈ పోస్టర్ విడుదలైన క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహేశ్-రాజమౌళి సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ అప్డేట్ కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మహేశ్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, పాన్-వరల్డ్ స్థాయిలో ఈ సినిమాను శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే క్రూరమైన విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఇక రాజమౌళి ఆస్థాన సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తాజాగా ప్రియాంక చోప్రా ‘మందాకిని’గా పరిచయం కావడంతో ఈ ప్రాజెక్ట్ పై హైప్ ఇంకాస్త పెరిగింది.

# ‘అఖండ 2’ నుంచి కీలక అప్డేట్



బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం “అఖండ 2”. ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనగా, ఆ ఉత్సాహాన్ని రెట్టింపు చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది. రేపు ముంబైలోని జుహూ పీవీఆర్‌లో ఈ పాట విడుదల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పాటకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ పాటను ప్రముఖ గాయకులు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ కలిసి ఆలపించారని తెలిపారు. “ఈ పాట వింటే మీకు నిద్రపట్టదు. ఆ ఎనర్జీ మనలో తాండవం చేస్తుంది. ఇది కేవలం పాట కాదు, శివుడి శక్తి” అంటూ తమన్ చేసిన పోస్ట్ అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేర్చింది. ఈ ఒక్క అప్‌డేట్‌తో సినిమా మ్యూజికల్ ప్రమోషన్లకు అదిరిపోయే ఆరంభం లభించినట్లయింది.

సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ సినిమాకు అన్ని మార్కెట్లలోనూ గట్టిగా ప్రచారం కల్పించాలని భావిస్తున్నారు.

ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, “అఖండ 2” అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని తెలుస్తోంది. ఈ హైప్‌ను ప్రేక్షకులకు చేరవేయాలంటే సరైన సమయంలో టీజర్, ట్రైలర్‌తో పాటు ఆల్బమ్‌ను విడుదల చేయడం చాలా కీలకం. అందుకే రాబోయే రోజుల్లో బాలయ్య-బోయపాటి-తమన్ త్రయం ప్రమోషన్ల విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు సమాచారం.

14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాకు, విడుదల ముందు “ఓజీ” తరహాలో స్పెషల్ ప్రీమియర్ షోలు ఏర్పాటు చేసే యోచనలో నిర్మాతలు ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇది సినిమాపై అంచనాలను మరింత పెంచుతుందని వారు భావిస్తున్నారు. మరోవైపు, బాలయ్య అభిమానులు సోషల్ మీడియాలో “మాస్ ఈజ్ బ్యాక్”, “బోయపాటి ఫైర్ రిటర్న్స్” వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో ఇప్పటికే సందడి చేస్తున్నారు.

SJS ABROAD MEDICAL ACADEMY
FOR MBBS ABROAD
Extensive Support for Future Medical Students Start Your Medical Career Today
For Students Aiming To Study Medicine Abroad Enroll Now For Upcoming Intakes
PH: +91 9112311114
. Customized Career Programs
. Visa Application Expertise
. Placement in Top Universities
. Guidance on Scholarships
. Assistance with Accommodation
. Pre-Departure Briefing
Intakes Open Now
TERMS & CONDITIONS APPLY*



## 4కే టెక్నాలజీలతో 21న

# ‘కొదమసింహం’ రీ రిలీజ్..



మెగాస్టార్ చిరంజీవి నటించిన ట్రెండ్‌సెట్టర్ చిత్రాలలో ‘కొదమసింహం’కు ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు తెరపై వచ్చిన పూర్తిస్థాయి కౌబాయ్ చిత్రంగా అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు కొత్త హంగులతో మళ్లీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ క్లాసిక్ చిత్రాన్ని 4కే క్వాలిటీతో రీ-మాస్టర్ చేసి, నవంబర్ 21న థియేటర్లలో గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. “కొదమసింహం నా కెరీర్‌లో ఒక సాహసోపేతమైన ప్రయాణం. ఇది నాకొక మరపురాని ఆల్బమ్ కూడా. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ చిత్రాన్ని 4కేలో రీ-మాస్టర్ చేసి నవంబర్ 21న థియేటర్లలోకి తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరి కోసం రీ-రిలీజ్ ట్రైలర్‌ను పంచుకుంటున్నాను” అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. కె. మురళీ మోహన్‌రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిరంజీవితో పాటు మోహన్ బాబు, రాధ, బాలీవుడ్ నటుడు ప్రాణ్, కైకాల సత్యనారాయణ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. రామా ఫిలింస్ బ్యానర్‌పై కె. నాగేశ్వరరావు నిర్మించిన ఈ సినిమాకు రాజ్-కోటి అందించిన సంగీతం అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సత్యానంద్, పరుచూరి బ్రదర్స్, విజయేంద్ర ప్రసాద్ వంటి ప్రముఖ రచయితలు ఈ చిత్రానికి పని చేశారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఈ చిత్రాన్ని 4కే రీస్టోరేషన్‌తో పాటు 5.1 సౌండ్‌తో డిజిటల్ రీ-మాస్టరింగ్ చేశారు. మెగాస్టార్‌ను కౌబాయ్ గెటప్‌లో, ఆయనదైన స్లిక్ యాక్షన్‌తో మరోసారి వెండితెరపై చూసేందుకు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published & Owned by LEKKALA SREENU and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at Guddapuvalasa Ramani, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082